నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | మే 04, 2024 | www.navatelangana.com

బట్ట చేతి సంచుల పంపిణీ


బట్ట చేతిసంచుల వితరణ

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బట్ట చేతి సంచుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు కొలబోయిన సత్యం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా శుక్రవారం ఉదయం కామారెడ్డి సి ఎస్ ఐ గ్రౌండ్ లో గల కూరగాయల మార్కెట్లో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బట్టతో తయారుచేసిన 200 చేతి సంచులను ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ఎన్నో రకాల ముప్పు వాటిల్లుతుందని, తద్వారా భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యం దెబ్బతిని మానవాళికి తీరని ప్రమాదం పొంచి ఉందని, కాబట్టి వీలైనంతవరకు ప్లాస్టిక్కు నివారిస్తూ బట్ట సంచులను ప్రత్యామ్నాయంగా వాడవలసిందిగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి సుధాకర్, సీనియర్ సభ్యులు డాక్టర్ బాలరాజు, నాగభూషనం, గరిపల్లి ధనుంజయ, వై. శంకర్, వెంకటరమణ పాల్గొన్నారు

మెడికల్ క్యాంపు పై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

ఈనెల 13వ తేదీ నాడు జరిగే పార్లమెంట్ ఎన్నికలలో ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపు లపై మండల వైద్యాధికారి యేమిమా, ఆదర్శ్ ఆశా వర్కర్లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే ఏ విధంగా ప్రథమ చికిత్స నిర్వహించాలో సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మీ ఓటు మాకే వేయ్యండి..

తట్టెడు మట్టెత్తుతా

ఉపాధి చోట.. నేతల బాట

- పని ప్రదేశంలో హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్న పార్టీల నాయకులు, అభ్యర్థులు
- సమీపిస్తున్న పోలింగ్ గడువు


కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-లింగంపేట్

పోలింగ్ తేదీ ముందుకు వస్తున్నా కొద్దీ.. ప్రధాన పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ప్రచారంలో ఏ చిన్న అవకాశాన్ని సైతం వదులుకోవడం లేదు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో రోడ్లమీద జనసంచారం తక్కువగా ఉండటంతో ఉపాధి పని ప్రదేశంలో పార్టీల నాయకులు ప్రచారం చేపడుతున్నారు. అన్ని పార్టీలు ఉపాధి పని ప్రదేశానికి వెళ్లి తమ తమ పార్టీల తరఫున ప్రచారం చేపడుతూ మ్యానిఫెస్టోను వివరిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు పది రోజులు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను తమ వైపు ఆకట్టుకోవడానికి మండల స్థాయి నాయకులు తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి కూలీలను ప్రసన్నం చేసుకునేందుకు తట్టెడు మట్టి ఎత్తుతా.. మాకే ఓటు వేయాలంటూ కోరుతున్నారు.

ఉదయం గ్రామాల్లోకి ఎన్నికల ప్రచారానికి వెళ్తే గ్రామాల్లో మహిళలు పురుషులు ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వెళ్లడంతో గ్రామాల్లో ప్రచారం కొనసాగడం లేదు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిజెపి పార్టీల నాయకులు మండల స్థాయి నాయకులు జిల్లా స్థాయి నాయకులు మాజీ శాసనసభ్యులు ఉపాధి కూలీల ఓట్లను రాబట్టుకోవడానికి పనులు జరిగే ప్రదేశాలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. కూలీలతో మాట్లాడుతున్నారు. జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ కు ఓటు వేసి గెలిపించాలని కూలీలను వేడుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల మేనిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు అందజేసి విలువైన ఓటు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని వేడుకుంటున్నారు. మరోవైపు బిఆర్ఎస్ పార్టీ పని జరిగే ప్రదేశాలకు వెళ్లి తమ అమూల్యమైన ఓటును పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ కు ఓటు వేయాలని కోరుతున్నారు. దీంతో బిజెపి పార్టీ జహీరాబాద్ అభ్యర్థి బీబీ పటేల్ కు ఓటు వేయాలని తమదైన శైలిలో కూలీలకు వివరిస్తున్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో కూలీలతో మట్టి తవ్వడం మట్టి మోయడం లాంటి పనుల్లో పాల్గొని వారి ఓట్లు రాబట్టే పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి పని కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ద్వారా చెరువులో పూడికత మట్టి రోడ్ల నిర్మాణం భూముల అభివృద్ధి నీటి కుంటలు నిర్మాణం చేపల చెరువుల నిర్మాణం చేపడుతున్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

అందుకాను కూలీలు ఉదయం ఏడు గంటలకి పని ప్రదేశానికి వెళ్లి 12 గంటల వరకు పని ప్రదేశాల్లో ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 85 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు ముఖ్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లింగంపేట్ నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి రామారెడ్డి రాజంపేట గాంధారి సదాశివ నగర్ మండలాల్లో ఉపాధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. కూలీలు ఆసక్తితో పాల్గొంటున్నారు. ఉపాధి కూలీల ఓట్లను తమ వైపు తిప్పుకోవడానికి నాయకులు తమదైన శైలిలో పని జరిగే ప్రదేశానికే ప్రయాణమవుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉదయం గ్రామాలలో ప్రచారం ఇంటింటికి ప్రచారం నిర్వహించిన కేవలం ఇళ్లల్లో వృద్ధులు మాత్రమే మిగిలి ఉండడంతో పని జరిగే ప్రదేశానికి నాయకులు బాటలు పడుతున్నారు. పని జరిగే చోట కూలీలతో మాట్లాడుతున్నారు. మరోవైపు రాత్రి వేళలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. 44 డిగ్రీల ఎండ తీవ్రత ఉండడంతో నాయకులు మాత్రం ఉదయం పని జరిగే ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడి ప్రచారాన్ని ముగించుకుంటున్నారు. రాత్రి ఏడు గంటల నుండి 9 గంటల వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

బీజేపీ బంధీఖానా నుంచి

దేశాన్ని విముక్తి చేద్దాం

- నియంతృత్వం మతతత్వం విధానాలను ఎదిరించి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం
- కూటమి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి
- బుక్‌లెట్ విడుదలలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు


బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీ బంధీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రూపొందించిన బుక్‌లెట్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. బిజెపి బందీ ఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దాం అని, ఓటుతో బిజెపిని ఓడిద్దాం, మతరాజ్యం వద్దు, ప్రజాస్వామ్యమే ముద్దు అని కోరారు. రాబోయే ఎన్నికల్లో దేశాన్ని నియంతృత్వం మతతత్వం విధానాలను ఎదిరించి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలందరూ బిజెపిని ఓడించాలని కూటమి భాగస్వామ్యైన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో ఎన్నికైన బిజెపి ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో పాటు జిల్లా అభివృద్ధి కొరకు నిధులను రాబట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అదేవిధంగా ప్రజల్లో వైశమ్యాలను పెంచడానికి ప్రయత్నం చేయటం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అందువల్ల జిల్లా ప్రజానికం అరవింద్ ను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సిపిఐ(ఎం) కార్యకర్తలు నాయకులు కరపత్రాలు బుక్లెట్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, నాయకులు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు

నవతెలంగాణ-కామారెడ్డి

ఈవీఎంలను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం ఆయా నియోజకవర్గాలకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్గో బస్సులలో తరలించినట్లు జిల్లా రెవెన్యూ కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గానికి 319, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి 338, కామారెడ్డి నియోజకవర్గానికి 333 ఈవీఎంలను తరలించినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, కాసీంఅలీ, ఎన్నికల విభాగం అధికారులు ఉమలత, ఇందిరా ప్రియదర్శిని, సంతోష్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజులు వర్షసూచన

- ధాన్యాన్ని రాత్రి సైతం రైస్‌మిల్లులకు తరలించండి
- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు సూచన


కొనుగోలు సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి

నవతెలంగాణ- కామారెడ్డి/రామారెడ్డి

రాబోయే మూడు రోజులల్లో జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో ధాన్యాన్ని రాత్రి సమయంలో కూడా రైస్‌మిల్లులకు తరలించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కామారెడ్డి, రామారెడ్డి మండలాలలోని వివిధ కొనుగోలు కేంద్రాలను, బాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా కామారెడ్డి మండలంలోని గర్గుల్ లో కేంద్రాన్ని, రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్, ఉప్పల్ వాయి , రామారెడ్డి లలో కొనుగోలు కేంద్రాలను, రెడ్డిపేట లోని భాగ్యలక్ష్మి బాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖీ అయి కేంద్రంలో వసతుల ఏర్పాట్లు, పేమెంట్ విషయమై ఆరా తీయగా ధాన్యం తూకం వేసిన మూడు రోజులల్లోగా ఖాతాలో డబ్బులు జమకావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ ఈ నెల 5 నుండి 7 వరకు వర్షాలు పడే సూచనలున్నందున ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండి ఎత్తు పల్లాలపై ధాన్యం ఉంచి టార్పాలిన్లు కప్పాలని, అధైర్యపడవద్దని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని రాత్రి పొద్దుపోయాక కూడా ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని నిర్వహకులకు, అదనంగా హమాలీలలను ఏర్పాటు చేసుకొని లారీలు వచ్చిన వెంటనే ధాన్యం అన్ లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు కేంద్రాలలో అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ట్యాబ్ ఎంట్రీ 80 నుండి 85 శాతం అవుతుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ధాన్యం మిల్లులకు తరలించిన రెండు రోజులల్లోగా రైతుల ఖాతాలో డబ్బులు పడేలా చూడాలన్నారు.

విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకుందాం

- ఏడి కిరణ్ చైతన్య

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యుత్ ప్రమాదాల నుండి ప్రజలను, విద్యుత్ సిబ్బందిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏడి కిరణ్ చైతన్య తెలిపారు. శుక్రవారం ప్రతి సంవత్సరం మే 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహించే విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనల కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులు వర్షాకాలంలో విద్యుత్ వైర్లు తెగిపోవడం, చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అనుకొని విద్యుత్ అంతరాయం ఏర్పడడం వంటి కారణాల వలన విద్యుత్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది ఇబ్బందులను గుర్తించి విద్యుత్ అధికారులకు సహకరించాలని సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, రామలక్ష్మి విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లతో హోమ్ ఓటింగ్

- పర్యవేక్షించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటి నుంచి ఓటు సేకరించే (ఓట్ ఫ్రమ్ హెూమ్) ప్రక్రియను నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. హెూమ్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమవగా, ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. మొదటి రోజున పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించినట్టు తెలిపారు. హెూమ్ ఓటింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అధికార బృందాల పనితీరును నిశితంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంటి వద్ద నుండే ఓటు వేసేలా ఎన్నికల సంఘం హెూమ్ ఓటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవడం వల్ల సీనియర్ సిటిజన్లు, దివ్యంగులకు ఎంతో వెసులుబాటు లభించిందని, ఇళ్ల వద్దనే వారు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. హెూమ్ ఓటింగ్ కోసం నియమించ బడిన బృందాలు ఆయా రూట్లలో తిరుగుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నాయని, ఓటర్ల ఇళ్ల వద్దనే ఓటింగ్ కంపార్ట్మెంట్ ను ఏర్పాటు చేసి, ఓటు గోప్యతకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకున్నా మని వివరించారు. వీడియో చిత్రీకరణతో పాటు సూక్ష్మ పరిశీలకులు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో మొత్తం 1758 మంది ఓట్ ఫ్రమ్ హెూమ్ సదుపాయాన్ని వినియోగించుకోనుండగా, వీరిలో 85 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 859 మంది, దివ్యంగ ఓటర్లు 899 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో హెూమ్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, నూటికి నూరు శాతం గోప్యతను పాటిస్తూ పూర్తి పారదర్శకంగా హెూమ్ ఓటింగ్ జరిపిస్తున్నామని అన్నారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో మొత్తం 50 బృందాలు హెూమ్ ఓటింగ్ లో పాల్గొంటున్నాయని, ప్రతి బృందంలో పీ.ఓ, ఓపీఓతో పాటు మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. హెూమ్ ఓటింగ్ కోసం అర్హత పొందిన వారికి అధికారుల బృందం వచ్చే సమాచారాన్ని ముందస్తుగానే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. హెూమ్ ఓటింగ్ కు సంబందించిన సమాచారాన్ని ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగానే తెలియజేయడంతో పలుచోట్ల వారు కూడా పరిశీలిస్తున్నారని అన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు తాము ఏ అభ్యర్థికి ఓటు వేశామనే విషయాన్ని ఇతరులు ఎవరికీ తెలుపకుండా గోప్యంగా ఉంచుతూ, స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని కలెక్టర్ సూచించారు.


ఇంటి వద్ద ఓటు వేయిస్తున్న అధికారులు

ఓటింగ్ శాతం పెంచాలి

- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఓటు ప్రాముఖ్యత, అదనంగా ఒక గంట పోలింగ్ సమయం పెంపుపై ప్రజలలో అవగాహన నిమిత్తం గ్రామాలలో ఆడియో ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం తెలిపారు. ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటువేసేందుకు అని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే 13 న ఉదయం 7 నుండి సాయంత్రం 6 జరిగే పోలింగ్ లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీగా వంద శాతం ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి ఒక్క ఓటరు ఓటు వేసేలా అవగాహన కల్గిస్తున్నామన్నారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం, బూత్ నెంబరు వివరాలు తెలుసుకొనుటకు నిరంతరం పనే చేసే హెల్ప్ లైన్ 1950 నెంబరు ద్వారా కానీ, www.voters.eci.gov.in, www.ceotelangana.nic.in వెబ్సైట్ల ద్వారా గాని, ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా కానీ తెలుసుకోవచ్చన్నారు. ఓటరు స్లిప్పులు ఓటర్లందరికీ అందజేయాలని, అదే సమయంలో ఓటు హక్కు ప్రాధాన్యత వివరించాలని సూచించారు. ఓటర్లందరూ ఓట్లు వేసేలా వారికి అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెంచాలని సూచించారు.

ఉపాధిలో ప్రజాపయోగ పనులు గుర్తించాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిగషనర్ జాన్ వెస్లీ

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న అధికారులు

మండలాలలో ఉపాధి హామీ కింద ప్రజలకు అవసరమైన వివిధ పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పిస్తూ, కనీస వేతనం 300 చెల్లించేలా చూడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమీషనర్ జాన్ వెస్లీ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో డిఆర్ డిఓ చందర్ నాయక్ తో కలిసి కూలీల హాజరు శాతం, కనీస వేతనం, పని ప్రాంతాలలో సౌకర్యాలపై ఎంపిడిఓలు, ఎపిఓలు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ లతో సమీక్షా సమావేశం నిర్వాహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని మండలాలలో కూలీల హాజరు, కనీస వేతనం చాలా తక్కువగా ఉందని, రాబోయే వారం రోజులల్లోగా సమీక్షించి హాజరు శాతం, కనీస వేతనం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా పనిచేసే చోట టెంట్లు, మంచినీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి, మాచారెడ్డి, తాడ్వాయి, రాజంపేట, రామారెడ్డి మండలాల ఎంపిడిఓలు, ఎపిఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

రేపు నీట్ ఎంట్రెన్స్ టెస్ట్

- 11 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతి.. ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

మెడికల్ కాలేజీలలో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షను నిజామాబాద్ జిల్లాలోని 10 సెంటర్లలో మే 5న మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల 20 నిమిషాల వరకు నిర్వహిస్తున్నట్లు నీట్ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ మెరిగ శక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్-మాధవ్ నగర్, ఎస్ ఎస్ ఆర్ సి బి ఎస్ ఈ స్కూల్, జననేపల్లి గ్రామం నవీపేట్ మండలం, ఎస్ఎస్ఆర్. డిగ్రీ కాలేజ్ ఖలీల్ వాడి, నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ బోధన్ రోడ్, ప్రెసిడెన్సి హై స్కూల్ మోపాల్, నిర్మల హృదయ స్కూల్ సుభాష్ నగర్, విజయ హై స్కూల్ ముబారక్ నగర్, క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్, ఆర్మూర్, నవ భారతి గ్లోబల్ స్కూల్-దాస్ నగర్, కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ,మాణిక్ బండార్ పరీక్షా కంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులను ఉదయం 11 నుంచి పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించనున్నారు. మధ్యాహ్నం 1 గంట 30 నిమిషాల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించరు. విద్యార్థులు చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, విలువైన ఆభరణాలతో పరీక్షా కేంద్రాలకు అనుమతించబోరు. విద్యార్థులు తమతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో గ్రాఫ్, ఏదైనా ఒరిజినల్ ఐడి ప్రూఫ్ (ఉదాహరణకు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఓటర్ ఐడి.....) లు తెచ్చుకోవాల్సి ఉంది. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఈ సెల్ నెంబర్ 89 7819 84 21 ను సంప్రదించాలని తెలిపారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

కరెంట్ కోతలు బాబోయ్

- ఒక వైపు ఉక్కపోత.. మరో వైపు కరెంట్ కోత

నవతెలంగాణ-భిక్కనూర్

అసలే ఎండకాలం.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 11 అయిందంటే చాలు బయటకు వెళ్లలేని పరిస్థితి. దీంతో ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఉక్కపోత తట్టుకోలేక కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు 24 గంటలు పాటు నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో కరెంట్ కోతలు.. ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల కాలంలో భిక్కనూర్‌లో తరుచూ కరెంట్ కోతలు విధిస్తున్నారు. 'అన్నా కరెంట్ ఎప్పుడు వస్తుంది' అని విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే చెట్ల కొమ్మలు కొడుతున్నాము, సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నాము, విద్యుత్ లైన్ సమస్య ఉంది అని ఇలా సమాధానాలు వస్తున్నాయి. విద్యుత్ సమస్యలు ఏ విధంగా ఉన్నా గత ప్రభుత్వంలో లేని విద్యుత్ కోతలు ప్రభుత్వం మారగానే ఎందుకు ఇలా కోతలు విధిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 'గత ప్రభుత్వం ఉన్న సమయంలో విద్యుత్ సమస్యలు లేవా అప్పుడు ఎలా పరిష్కరించారు? ప్రభుత్వం మారగానే ప్రతి చిన్న గాలి, వాన చెట్టు కొమ్మ కొట్టియాలన్నా ఎందుకు విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని' విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సమయం సందర్భం లేకుండా కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నట్టు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కాలం ఉక్కపోత నుంచి ఉపశమనం పొందాలనుకుంటున్న తరుణంలో కరెంటు కోతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలు విధించవద్దని ప్రభుత్వం, జిల్లా విద్యుత్ అధికారులు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ పట్టణ విద్యుత్ కోతలతో విద్యుత్ అధికారులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు విద్యుత్ కోతలను ముగింపు పలుకుతారా లేక తీరు మారదు అన్నట్లు కోతలు విధిస్తారా అన్నది వేచిచూడాలి.

ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఏపీవో



ఉపాధి కులీలతో మాట్లాడుతున్న ఏపీవో

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని నల్లచెరువులో ఉపాధి పనులను ఏపీవో గంగారాం శుక్రవారం పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటల నుంచి 11గంటల వరకు ఉపాధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ జాబ్ కార్డుకు 100 రోజల పని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 11,000ల మంది కూలీలు కోటగిరి ఉమ్మడి మండలంలో ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని వివరించారు. ప్రతి ఒక్కరికి రూ.200ల పైచిలుకు కూలీ వస్తుందని తెలిపారు.

జీవన్‌రెడ్డి గెలుపు ఖాయం

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు అన్నారు. పలు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారత ప్రధాన మంత్రిగా రాహుల్ గాంధీని గెలిపించుకోవాలని, అందుకు నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగం, సర్పంచ్ పాల్దా భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్ ఆర్టీసీ కాలనీ అధ్యక్షులుగా కృష్ణ



ఆర్టీసీ కాలనీ అధ్యక్షులుగా ఎన్నికైన్న కృష్ణకు అభినందన

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఆర్టీసి కాలనీ నూతన కమిటీ అధ్యక్షులుగా కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బోధన్ ఆర్టీసీ కాలనీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో బాలగంగాధర్‌రావు, పరుచూరి నగేష్‌బాబు, బాలగౌడ్, వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా వడ్ల గోపి, ప్రధాన కార్యదర్శిగా రావెళ్ళ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా హనుమంతరావు, చిరంజీవి, కోశాధికారిగా నరేందర్ గుప్తా, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా పరుచూరి శ్రీనివాస్‌రావు, సర్వేశ్వర్, నగేష్, దత్తు, అరవింద్, అర్జున్, రాజు, బలరాంను ఏకగ్రీవంగా ఎన్నున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆర్టీసీ కాలనీ సమస్యల పరిష్కారానికి, కాలనీ అభివృద్ధి కోసం తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు కాలనీ పెద్దలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్నికైన వారిని కామేపల్లి సత్యం శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఉపాధి హామీ చట్టం కాంగ్రెస్ తెచ్చిందే

- బోధన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఉపాధి హామీ కోఆర్డినేటర్ మెగావత్ సరిదాస్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉపాధి హామీ చట్టం ప్రారంభమైందని గత పది సంవత్సరాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నాయని బోధన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఉపాధి హామీ కోఆర్డినేటర్ మెగావత్ సరిదాస్ అన్నారు. మండల కేంద్రంలోని దర్యాపూర్, అభంగపట్నం గ్రామాలలో చెరువులలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలను శుక్రవారం ఎంపీ ఎన్నికల సందర్భంగా కలిసి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీని రోజురోజుకూ నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వస్తే ఉపాధి కూలి రూ.400కు పెంచడమే గాక పని దినాలను సైతం పెంచుతుందని అన్నారు. కాబట్టి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని వివిధ గ్రామాలలో గల ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ నాయకుడు, జెడ్పిటిసి కమల నరేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయనను గెలిపిస్తే రూరల్ నియోజకవర్గానికి అత్యధిక నిధులు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి చేస్తాడని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా ఎల్లప్పుడూ ప్రజల గురించి ఆలోచించే మనిషిని అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల తరపున పోరాడే ఏకైక వ్యక్తి బాజిరెడ్డి గోవర్ధన్ అని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోచ్చ శ్రీనివాస్, న్యాల్కల్ శ్రీనివాసరావు, మంచిప్ప మాజీ సర్పంచ్ ఇందూరి సిద్దార్థ, ముత్యంరెడ్డి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న స్వాతంత్ర సమరయోధుడు

నవతెలంగాణ-ఆర్మూర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణానికి చెందిన (పట్టుకరి)క్షత్రియ కులానికి చెందిన స్వాతంత్ర సమర యోధుడు దొండి జగ్గే శివదాస్ (93) అనే వృద్ధుడు తన ఓటు హక్కును శుక్రవారం వారి స్వగృహంలో వినియోగించుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అందరూ కూడా తమ ఓటు హక్కును తప్పనిసరి వినియోగించుకోవాలని సూచించారు.



ఓటు వేస్తున్న వృద్ధుడు

ఈవీఎంల రెండోవిడత ర్యాండమైజేషన్

- అబ్జర్వర్ సమక్షంలో కొనసాగిన ప్రక్రియ
- హాజరైన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంటు సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ నేతృత్వంలో ఈవీఎంల రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం పూర్తి చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎదుట ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ జరిపారు. నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1808 పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు వివరిస్తూ, ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్క్రీన్‌పై పారదర్శకంగా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, జగిత్యాల శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూమ్‌లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వాటిని భద్రపర్చినట్టు కలెక్టర్ తెలిపారు. మొత్తం 1808 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను రిజర్వ్‌లో ఉంచడం కోసం కేటాయిస్తున్నామని, 40 శాతం వి.వి.ప్యాట్‌లను రిజర్వ్‌లో ఉంచేలా అదనంగా కేటాయిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో 29 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు చొప్పున బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి ఉందన్నారు. ఈ మేరకు రిజర్వు యూనిట్లను కలుపుకుని మొత్తంగా 4514 బ్యాలెట్ యూనిట్లు, 2257 కంట్రోల్ యూనిట్లు, 2527 వివి.ప్యాట్ యంత్రాలను కేటాయించడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చూస్తే, 217 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉన్న ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్ కు 542 బ్యాలెట్ యూనిట్లు, 271 కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా లెక్కిస్తూ 303 వి.వి.ప్యాట్లు కేటాయిస్తున్నట్టు వివరించారు.



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

246 పోలింగ్ కేంద్రాలు కలిగిన బోధన్ సెగ్మెంట్‌కు 614 బీ.యూలు, 307 సీ.యూలు, 344 వివి.ప్యాట్లు, 289 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉన్న నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్‌కు 722 బీ.యూలు, 361 సీ.యూలు, 404 వివి.ప్యాట్లు, 293 పోలింగ్ కేంద్రాలు గల నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 732 బీ.యూలు, 366 సీ.యూలు, 410 వివి.ప్యాట్లు, 247 పోలింగ్ కేంద్రాలు కలిగిన బాల్కొండ శాసనసభ నియోజకవర్గానికి 616 బీ.యూలు, 308 సీ.యూలు, 345 వివి.ప్యాట్లు, 262 పోలింగ్ కేంద్రాలు కలిగిన కోరుట్ల శాసనసభ నియోజకవర్గానికి 654 బీ.యూలు, 327 సీ.యూలు, 366 వివి.ప్యాట్లు, 254 పోలింగ్ కేంద్రాలు కలిగిన జగిత్యాల నియోజకవర్గానికి 634 బీ.యూలు, 317 కంట్రోల్ యూనిట్లు, 355 వివి.ప్యాట్ల చొప్పున ర్యాండమైజేషన్ జాబితా ప్రకారంగా కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండ పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపడుతున్నామని అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో శనివారం నుంచి కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 5 నుంచి కమిషనింగ్ చేపడతారని కలెక్టర్ వివరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సాకేత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అరుణోదయ రామన్న అమరత్వ స్ఫూర్తితో ప్రజా స్వరాలమవుదాం

- అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు

నవతెలంగాణ-ఆర్మూర్

అరుణోదయ రామన్న అమరత్వ స్ఫూర్తితో ప్రజాస్వారాలమవుదామని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు అన్నారు. రామారావు ఐదవ స్మారక సందర్భంగా పట్టణంలో శ్రామికనగర్ మామిడిపల్లిలో అరుణోదయ జిల్లా అధ్యక్షులు వి.సూరిబాబు అధ్యక్షతన జరిగిన 5వ స్మారక సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. జననం, మరణం సహజమేనని.. పీడిత ప్రజల మనిషిగా మరణించడం హిమాలయాల కన్నా ఉన్నతమని ఆయన అన్నారు. పేద కుటుంబంలో పుట్టిన రామారావు, శ్రామిక జన విముక్తి కొరకు అరుణోదయ రథసారథిగా ఎదిగి, కృషి చేశారని ఆయన అన్నారు. ప్రజా ఉద్యమాలకు ఉత్ప్రేరణ అందించిన రామారావు.. అనేక ఉద్యమాలకు చేయూతనిచ్చారని ఆయన తెలిపారు. అనేక అవకాశాలు వచ్చిన ప్రజల పక్షామే నిలబడి తన శ్వాస ఉన్నంతవరకు ప్రజా కళాకారుడిగా కొనసాగి ప్రజా కళాకారులకు ఆదర్శప్రాయంగా నిలిచారని దాసు తెలిపారు. శ్రమ నుంచి పురుడు పోసుకున్న పాట, కళారూపాలు శ్రామిక జన విముక్తి కోసం ఆయుధంగా మార్చి, రామారావు ప్రజా కళాకారులకు దిక్సూచిగా నిలిచారని దాసు కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కృషి మరువలేనిదని దాసు అన్నారు. సురేష్ బాబు మాట్లాడుతూ.. అనేకమంది కళాకారులు డబ్బుల కోసం ఎగబడుతున్నారని, రామారావు ప్రజల కష్టాల విముక్తి కోసం నిర్బంధాన్ని ఎదిరించి, శ్రామిక గొంతుగా నిలిచారని ఆయన తెలిపారు. ఈ స్మారక సభలో అరుణోదయ రంజిత్, వివిధ ప్రజాసంఘాల నాయకులు వర్దారెడ్డి, మహమ్మద్, లోకేష్, మొహమ్మది, భాను, ఇన్నా సమీర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

విప్లవోద్యమ పోరు కెరటం 'కామ్రేడ్ మూలుగు రాజేందర్'

- సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్

నవతెలంగాణ-సిరికొండ

'విప్లవోద్యమ పోరుకెరటం కామ్రేడ్ మూలుగు రాజేందర్.. గ్రామీణ విప్లవ రైతాంగ పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఉద్యమ నేత అని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతాంగ నాయకుడు, విప్లవ కమ్యూనిస్ట్ యోధుడు మూలుగు రాజేందర్ 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ రాజేందర్ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు ఆర్.దామోదర్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెండునిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ రాజేందర్ చిన్నతంలోనే విప్లవ రాజకీయాలవైపు ఆకర్షంచబడి నిలబడ్డ గొప్ప విప్లవ కమ్యూనిస్ట్ యోధుడు అన్నారు. తప్పుడు రాజకీయాలను వ్యతిరేకించి సరైన విప్లవ రాజకీయాల కోసం క్రమశిక్షణతో కృషిచేసిన విప్లవ సైనికుడు అని కొనియాడారు. అయన ఆశయాలను నెరవేర్చడం అంటే బలమైన విప్లవోద్యమాలను నిర్మించడమేనని తెలిపారు. చిన్నతనంలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షింపబడి చివరివరకు విప్లవ రాజకీయాలకోసం నిలబడ్డ కమ్యూనిస్ట్ నాయకుడు కామ్రేడ్ రాజేందర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ నాయకులు సాయిరెడ్డి, మండల నాయకులు రమేష్, సర్పంచ్ సాయిలు, పుష్పలత, రాజేశ్వర్, నాగన్న, ఆశీష్, నరేష్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, కండక్టర్. లింగన్న, తదితరులు పాల్గొన్నారు.



రాజేందర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ పోరాటం మరువలేనిది

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్



అంజాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ రైతాంగానికి మద్దతుగా ఢిల్లీలో జరిగిన రైతు పోరాటంలో ఆయన కృషి మరువలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. సిపిఐ జాతీయ కార్యదర్శి, అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ అతుల్ కుమార్ అంజన్ అనారోగ్యంతో నేడు లక్నోలో మరణించారని అన్నారు. వారు విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా, రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, బిజెపి రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన 3 నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో చేసిన రైతాంగ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారని అన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శిగా బహుముఖమైన సేవలు అందించారని జాతీయ సమితి నుంచి తెలంగాణ రాష్ట్రానికి నిర్మాణ బాధ్యులుగాను సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కె.రాజన్న, నాయకులు పి.రంజిత్, పి.నర్సింగ్‌రావు, ఆనంద్, బాలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సన్మానం



సన్మానం పొందిన విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో హర్షిక, శంకర్ 10/10 జీపీఏ సాధించడం, అలాగే ఇతర విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ, 1996-96 గోల్డెన్ బ్యాచ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామ కమిటీ, యువత సహకరించాలన్నారు. అనంతరం 1996-97 ఎస్ఎస్సి గోల్డ్ బ్యాచ్ తరపున ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఎస్సి గోల్డ్ బ్యాచ్ ప్రతినిధులు పురుషోత్తం, అంకం నరేష్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ కమిటీ సభ్యులు ప్రసాద్, హనుమాన్లు, ప్రదీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పురానీపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ పాలకొండ రాధ కృష్ణ, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ రాములు, పత్రి స్వామి, మొహమ్మద్ రఫీ, కుమ్మరి లక్ష్మణ్, సచిన్, రాజేశ్వర్, సీరం నరేష్, ఊరే గోవర్ధన్, రాజ్ కుమార్, మేసా శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పలువురు ఆత్మీయ కుటుంబాలకు పరామర్శ



అన్సారీ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మండల పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు గ్రామాలలో శుక్రవారం పర్యటించారు. అనంతరం పలువురు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ఖాజీ సాబ్ హుస్సేన్ మొయినుద్దీన్ అన్సారీ మృతిచెందడంతో వారి పార్థివ దేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన గోపి తల్లి మృతిచెందడంతో వారిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన పట్కార్ శ్రీనివాస్ తల్లి మృతిచెందడంతో వారిని, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

ఎంపీపీ బుద్దె సావిత్రి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ విప్



ఎంపీపీని పరామర్శిస్తున్న మాజీ ప్రభుత్వ విప్

నవతెలంగాణ-బోధన్

కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బోధన్ మండల ఎంపీపీ బుద్దే సావిత్రినిశుక్రవారం పరామర్శించారు. సాలూర మాజీ ఎంపిటిసి బుద్ధి రాజేశ్వర్ గత 15 రోజుల క్రితం ఆకస్మికగా మృతి చెందడం వలన సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బుద్దె రాజేశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధె రాజేశ్వర్ మంచి రాజకీయ నాయకుడిగానే కాకుండా పెరిక సంఘం అభివృద్ధికి తన వంతు సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం మాకు ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే వ్యక్తి ఇలా ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమన్నారు. అయన వెంట పెరిక సంఘం నాయకులు ఇల్తేపు రమేష్, ఇల్తెపు శంకర్, బొర్ర గంగయ్య, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ షకీల్, కన్నె లక్ష్మణ్, శంకర్ తదితరులున్నారు.

ఉపాధి కల్పించడమే జాబ్ మేళా లక్ష్యం

- శ్రావణి ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రావణి ఐటిఐ కళాశాల ఆధ్వర్యంలో జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శ్రావణి ఐటిఐ కామారెడ్డి యందు జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఐటీసీ మల్టీ నేషనల్ కంపెనీ తోషిబా రెయిన్ బ్రాస్ బ్రసిల్ లివేర్స్, నిజాంబాద్ ప్రాంతానికి చెందిన వరుణ్ మోటార్స్ కంపెనీ పాల్గొన్నారరని అన్నారు. ఇందులో శ్రావణి ఐటిఐ నుండి సుమారు 100 మంది ట్రైనర్స్ పాల్గొన్నారు. దీనిలో నుండి 35 మందికి ని ఎంపిక చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి లోని ఆమని ఐటిఐ కళాశాలప్రిన్సిపల్ వెంకటశివరావు , ఆయా కంపెనీల ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

నవతెలంగాణ- రామారెడ్డి



ప్రమాదవశాత్తు వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రెడ్డి పేట గ్రామానికి చెందిన నామాపురం శ్రీనివాస్ (41) భార్య చనిపోవడంతో, పిల్లలు లేకపోవడంతో ఇంట్లో ఒక్కడే జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు కిందపడి రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి చుట్టుపక్కల వారు, తల్లి చూసేసరికి మృతి చెందాడని తల్లి నామపురం నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై కొండ విజయ్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్త కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమతులు నిల్ తవ్వకాలు ఫుల్

- మహారాష్ట్రకు, కర్నాటకకు తరలుతున్న మన మట్టి
- పట్టించుకోని అధికారులు


సిద్దాపూర్ చెరువు నుండి మట్టి తవ్వకాలు చేసి టిప్పర్లు, ట్రాక్టర్లలలో తరలిస్తున్న దృశ్యం


ట్రాక్టర్‌లో మట్టి తరలింపు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని జుక్కల్ జీపీ పరిధిలోని సిద్దాపూర్ గ్రామ చెరువు అక్రమ మట్టి తవ్వకాలు అక్రమదారులకు అడ్డగా మారింది. ప్రతి ఎటా మట్టి మాఫియా దారులు రైతుల పేరుతో మట్టిని వేల రూపాయలకు అమ్మకాలు చేసి చెరువులను గుళ్ల చేస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ శాఖల వారికి సంబంధం ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఈ తంతు కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పక్కరాష్ట్రాలకు చెరువు మట్టి తరలింపు

బంగారం లాంటి చెరువు నల్ల మట్టిని పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. స్థానిక రైతుల పేరుతో అనుమతులు పొందుతూ.. బార్డర్ దాటిస్తున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు నిద్రమత్తు వీడటం లేదు.

నిబంధనలకు నీళ్లు..

మట్టి తవ్వాలంటే ముందుగా నీటీ పారుదల శాఖకు మట్టి తవ్వకాలు చేస్తామని దరఖాస్తు చేసుకోవాలి. తదనంతరం రెవెన్యూ శాఖ చెరువు లోపలి స్థలం పరిశీలించి మట్టి తవ్వకాలకు లోతు, దూరం కొలతలు తీసి హద్దులు పాతిన దాంట్లో నుండి మట్టి తవ్వకాలు సంబంధిత ఇరిగేషన్ శాఖ సూపర్ వైజర్ పర్యవేక్షణలో తవ్వకాలు నిర్వహించాలి. ఎన్ని ట్రిప్పులు తరలించారో వివరాలను రికార్డులో నమోదు చేయాలి. కానీ వీటన్నింటినీ తుంగలో తొక్కి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా మట్టిని తవ్వకాలు చేసి లక్షల రూపాయల ప్రకృతి సంపదను దోచుకోవడం ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అక్రమ చెరువు మట్టి తవ్వకాలు చేస్తున్న మాఫీయాపైన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర టాస్క్ ఫోర్స్ విజిలెన్స్ కమిటీ


ధాన్యం కొనుగోలు తీరు పరిశీలిస్తున్న టాస్క్ ఫోర్స్ అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భిక్కనూర్, పెద్ద మల్లారెడ్డి గ్రామాల్లో ఉన్న సొసైటీ కేంద్రాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్రస్థాయి టాస్క్ ఫోర్స్, విజిలెన్స్ అధికారులు శ్రీధర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, డీటీ కిష్టయ్య, రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, క్లస్టర్ అధికారులు గురువారం పరిశీలించారు. రైతులతో పిపిసిలో జరిగే తూకం, ట్యాబ్ ఎంట్రీ, ఇతర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పి పి సి ఇన్చార్జి గంగారాములుకి సకాలంలో తూకం చేయాలని, తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. అలాగే ట్యాబు ఎంట్రీ వెంట వెంటనే చేసి, రైతులకు సకాలంలో డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఈఓ మోహన్ గౌడ్, నర్సింలు, సిబ్బంది రవి,రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భాగిర్థిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఇంచార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరికి ఉపాధి కూలీ పని కల్పించాలని, కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. కూలీల సంఖ్య పనికి వస్తున్న కూలీల వివరాలు, రికార్డులు పరిశీలించారు. ఉపాధి హామీ పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది, ఉపాధి కూలీలు ఉన్నారు.

జిల్లాకు భారీ వర్ష సూచన

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ - కామారెడ్డి

రాబోయే మూడు రోజులల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అందరు అధికారులు అప్రమత్తంగా ఉండవలసినదిగా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మానిటరింగ్ అధికారులు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లతో శుక్రవారం నా టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుండి 7 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన టార్పాలిన్లు, గోనె సంచులు కేంద్రాలలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించుటకు కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను అందించాలని ట్రాన్స్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఎటువంటి ఆలస్యం చేయకుండా రాత్రి పొద్దుపోయాక కూడా కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేసి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లుల యజమానులు ఎటువంటి ఆలస్యం చేయక వచ్చిన ధాన్యాన్ని వెంటనే లారీల నుండి అన్ లోడ్ చేసుకొని ట్రక్ షీట్ జారీచేయడంతో పాటు వంద శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలనీ కోరారు.

అందరు డిప్యూటీ తహసీల్దార్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తూ వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. కేంద్రాల ఇంచార్జిలు, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ నాణ్యతా ప్రమాణాల కనుగుణంగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే వరకు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. రైతులు ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండి ఎత్తు పల్లాలపై ధాన్యం ఉంచి టార్పాలిన్లు కప్పాలని, అధైర్యపడవద్దని అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహశీల్దార్లు, మానిటరింగ్ అధికారులు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం


ఉపాధి పనుల వద్ద ప్రచారం చేపడుతున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. శుక్రవారం మండలంలోని మద్దికుంట, రెడ్డి పేట లో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, పార్టీ ఇన్చార్జ్ అధ్యక్షులు మద్దికుంట నరస గౌడ్ ఆధ్వర్యంలో, రామారెడ్డి లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, జహీరాబాద్ నియోజకవర్గం అభ్యర్థి సురేష్ రెడ్డి గారు గెలిపించాలని కోరారు. రామారెడ్డి మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బి ఆర్ ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలిపించాలని కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెండ్యాల నర్సారెడ్డి, బండి ప్రవీణ్, దుంపల బాలరాజు, దన్ సింగ్, నాయిని నర్సింలు, బి పేట నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నాగిరెడ్డి పేట్ మండలంలోని వదలపర్తి పోచారం గ్రామాలలో శుక్రవారం రోజు బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య జెడ్పిటిసి సభ్యుడు మనోహర్ రెడ్డి తో పాటు బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, రాజిరెడ్డి ,మంగలి యాదగిరి ,బాబురావు ,వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్

ఓటింగ్ హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల అధికారి డి శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 4, 5 శని ఆదివారాలలో 85 సం" లు పైబడిన వారు, పూర్తిగా అంగ వైకల్యం కలిగిన వారికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని, ఫార్మ్ -12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణకు విధులు నిర్వర్తిస్తున్న వివిధ డిపార్ట్మెంట్ ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ హక్కును వినియోగించు కోవడానికి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇతర పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు ఉండి ఇక్కడ(జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో) ఉద్యోగం చేస్తూ ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారి కోసం మూడు(3) పోలింగ్ కేంద్రాలను మద్నూర్ తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలు ఈనెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవా లని వజ్రాయుధం లాంటి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

చిన్నకొడప్‌గల్ సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

- గతంలో నెగ్గిన అవిశ్వాసం


చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులకు సన్మానం


నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కొడప్‌గల్ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారు. నూతన చైర్మన్‌గా నాగిరెడ్డి , వైస్ చైర్మన్ గంగా గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

గత చైర్మన్ నారాయణరెడ్డి , వైస్ చైర్మన్ గోకన్ సాయిలుపై కొంతమంది డైరెక్టర్లు విశ్వాస తీర్మాన పత్రాలను విండో అధికారికి అందజేయడంతో గత మార్చ్ 6న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా ఉమ్మడి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీసుల కట్టుదిట్ట భద్రతల మధ్య 3 గంటలపాటు అవిశ్వాస తీర్మానం కొనసాగింది. చైర్మన్ నారాయణరెడ్డి గైర్హాజరు అయినప్పటికీ వైస్ చైర్మన్ తో పాటు 11 మంది సంఘ సభ్యులు హాజరై చైర్మన్ , వైస్ చైర్మన్‌లపై అసమ్మతితో పదిమంది సభ్యులు చేతులు పైకెత్తడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కాగా గత చైర్మన్ కోర్టుకు ఆశ్రయించడంతో అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వాయిదా వేశారు. కోర్టు ఉత్తర్వులతో వాయిదా పడింది. ఎట్టకేలకు కోర్టు సింగిల్ విండో ఎన్నిక అనివార్యమని తేల్చి చెప్పడంతో చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నికలను అనివార్యమైంది.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ రామ్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకట్ రెడ్డి , మాజీ డిసిసిబి డైరెక్టర్ చింతల సాయి రెడ్డి, పెద్ద కొడప్గల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి నాయకులు బొడ్ల బాలరాజ్ , కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు.. ప్రచారం


షబ్బీర్‌అలీ సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా పాలన

నవతెలంగాణ-కామారెడ్డి/దోమకొండ


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజలకు ప్రజాపాలన దొరుకుతుందని బిబిపేట మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్న గారి నాగరాజు గౌడ్ అన్నారు. బిబిపేట్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం విధితమే. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో నాగరాజ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనకు షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ రానున్న జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ గెలుపు కొరకు తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సహకారంతో మా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఆయనతోపాటు మాందాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి సంఘం 1 అధ్యక్షులు చింతర్ల మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, భాస్కర్ రెడ్డి, కమ్మరి రంజిత్ కుమార్, సాకలి స్వామి, రొడ్డ లింగం, దుర్గాగౌడ్ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్, జిల్లా కార్యదర్శి భూమాగౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి,మండల కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ కుమార్, నాగేశ్వర్,చంద్రా గౌడ్, సలీం , మండల కో ఆప్షన్ సభ్యుడు ఆసీఫ్,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ సినియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రొడ్డ రాజు,శ్రీకాంత్ రెడ్డి, రొడ్డ బాబు, దయానంద్ గౌడ్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారం

కామారెడ్డి : బీబీపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ వెంటే ఉంటామని, కాంగ్రెస్ పార్టీ తలపెట్టినటువంటి ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి జీరో కరెంట్ బిల్లు 500 కే గ్యాస్ లాంటి కార్యక్రమాలను నిర్వహించి పేదల కష్టాలను దూరం చేసినందుకు ప్రతి ఒక్కరు సంతోషం వ్యక్తం చేస్తూ మా ఓటు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి వేస్తామని చెప్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూతరి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ మొహమ్మద్ ఆసిఫ్ మాజీ, సర్పంచ్ గాడి లింగం, మాజీ ఉపసర్పంచ్ మ్యాదరి సత్తయ్య, మీసాల సత్తయ్య దోమల సిద్దరాములు, మొహమ్మద్ ఇమామ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర ప్రచారం

మద్నూర్ : జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైలాసం చేసుకునేందుకు ఆ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం మద్నూర్ మండల ముఖ్య నాయకులు శుక్రవారం నాడు పల్లె గ్రామాల్లో పర్యటిస్తూ ముమ్మరంగా ఇంటింట ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని ముఖ్య నాయకులు పల్లె గ్రామాల్లో ప్రజలకు ప్రచారంలో విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దరాస్ సాయిలు ఆధ్వర్యంలో చేపట్టగా మండల మాజీ జెడ్పిటిసి సభ్యుడు, యువ నాయకులు రామ్ పటేల్, చిన్న షక్కర్గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిగంబర్, మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భిక్కనూర్ : కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం మాజీ ప్రజా ప్రతినిధులు రాజంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ కౌన్సిలర్ రాములు, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, పద్మశాలి యువజన విభాగం కామారెడ్డి పట్టణ అధ్యక్షులు రమేష్, భిక్కనూర్ సొసైటీ మాజీ చైర్మన్ సిద్ధ గౌడ్ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, లింబాద్రి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మద్దికుంట ఆలయ కమిటీ చైర్మన్

రామారెడ్డి : మండలంలోని మద్దికుంట ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. తిరిగి శుక్రవారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో గోజారి భాస్కర్ రెడ్డి, దుంపల శ్రీకాంత్, స్కూల్ తాండకు చెందిన బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షులు సలావత్ తిరుపతి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు సలవర్ చందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు గంగావత్ బోజు, ప్రధాన కార్యదర్శి సలావత్ శ్రీరామ్ తోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రెడ్డి నాయక్, విట్టల్ నాయక్, బండి ప్రవీణ్, దుంపల బాలరాజు, గజ్జల బాలరాజు, బోజు నాయక్, చందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి

దోమకొండ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబీర్ అలీ సోదరుడైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నయీమ్ ను దోమకొండ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల గౌడ్ యువజన నాయకుడు పిస్నెం నాగేంద్ర వర్మ శుక్రవారం శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి మధుసూదన్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం మధు ఉన్నారు.

సురేష్ షెట్కార్‌ను గెలిపించండి

లింగంపేట్ : జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఓటర్లను వేడుకున్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు జడ్పీటీసీ శ్రీలత సంతోష్ రెడ్డి లింగంపేట మండల ప్రెసిడెంట్ నారగౌడ్, ఆధ్వర్యంలో లింగంపేట మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆర్గారంటీలు కచ్చితంగా అమలు చేస్తుందన్నారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు అందించారు.

సొంత నిధులతో క్యాప్స్, టవల్స్ అందజేత


టవల్స్, క్యాప్స్ అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యుత్ డివిజన్ ప్రెసిడెంట్ 1104 యూనియన్ జేఏఓఎం సంజీవ్ యూనియన్ సొంత నిధులతో ఆర్మూర్, పెర్కిట్ సబ్ ఈఆర్వోలో స్పాట్ బిల్లింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వారికి వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ క్యాప్స్, టవాల్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు ఉపాధి హామీ క్షేత్రల్లో మేడే ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల గోవర్ధన్ మాట్లాడుతూ.. 138వ మేడే ఉత్సవాలని జరుపుకుంటున్న ఈ తరుణంలో దేశం క్లిష్ట పరిస్థితులలో ఉందని, అలాగే దేశాన్ని శాసించే పార్లమెంటు ఎన్నికలు కూడా రానున్న నేపథ్యంలో బీజేపీని ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం పోరాడి 2005లో సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. కార్యకమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించుకుందామని భీంగల్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు బాదవత్ గోపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కారేపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ పని దగ్గరికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే ఉపాధి హామీలో పనిచేసే ప్రజలు ఎండ తీవ్రంగా ఉందని, చల్లని నీళ్ల అందించాలని ప్రజలు కోరితే తన సొంత డబ్బుతో ప్రతిరోజు 200 లీటర్లు చల్లటి నీరు అందిస్తున్న గోపాల్ నాయక్‌కు ఉపాధి హామీ కూలీలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామశాఖ అధ్యక్షులు ఆంగోత్ రమేష్, సురేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ కారు గుర్తుకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు పెంటు గంగాధర్, చిల్క గోపాల్, బ్రమ్మదండి లింగం, కో ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్, గద్దలసాయిలు, మోహన్ రెడ్డి, రఫీ, బొట్ల భూమన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు చిగురింతల పుస్తకావిష్కరణ సభ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు భాషోపాధ్యాయుడు, ప్రముఖ కవి, చిత్రకారుడు, ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక కోశాధికారి చింతల శ్రీనివాస గుప్త కలం నుంచి జాలువారిన బాలగేయాలు సంపుటి "చిగురింతలు" పుస్తకావిష్కరణ సభ శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల హరిచరణ్ మార్వాడి విద్యాలయం సమావేశ మందిరంలో ఇందూరు జిల్లా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రముఖ కవి, కొరవి గోపరాజు, సాహిత్య సంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కంకణాల రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బాలసాహితీవేత్తలు డాక్టర్ వి.ఆర్.శర్మ, తల్లావజ్ఝల మహేష్‌బాబు, విజయ్ విద్యా సంస్థల అధినేత్రి, రచయిత్రి, ప్రముఖ కవయిత్రి డాక్టర్ జి.అమృతలత అతిథులుగా విచ్చేసి చిగురింతలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆసక్తిగల కవులు, కళాకారులు, కవయిత్రులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన పద్మశాలి ముఖ్య నాయకులు


కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పద్మశాలీ ముఖ్య నాయకులు మాజీ కౌన్సిలర్ గుద్దేటి రమేష్, పట్టణ పద్మశాలీ సంఘం(8తర్పల) అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు (8 తర్పల) అధ్యక్షులు గుద్దేటి డిష్ రాము, పద్మశాలీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు దాసరి అనిల్ తదితరులు శుక్రవారం మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ విప్ అనిల్ ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, కౌన్సిలర్లు శాల ప్రసాద్, కొంత మురళి, మాజీ సర్పంచ్ సదాశివ్, మాజీ కౌన్సిలర్ మహమూద్ అలీ, కాంగ్రెస్ నాయకులు జిమ్మి రవి, అజ్జు బాయ్, రాజు భాయ్, చిట్టిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వస్తే రిజర్వేషన్లు ఉండవు

- తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి
- ఆగస్టు 15 రుణమాఫీ ఏ సంవత్సరమో చెప్పాలి..?
- ఎంపీ అరవింద్.. పసుపు బోర్డు, గల్ఫ్ పాలసీ ఎక్కడ..?
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీజేపీ వస్తే రిజర్వేషన్లు ఉండవని.. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఆగస్టు15 రుణమాఫీ ఏ సంవత్సరమో స్పష్టంగా చెప్పాలని సీఎంకు సూచించారు. ఎంపీ అరవింద్ తెస్తానన్న పసుపు బోర్డు, గల్ఫ్ పాలసీ ఎక్కడుందని, మోడీ వేస్తానన్న రూ.15 లక్షలు ఎక్కడ అని ప్రశ్నించారు. రెండు కోట్ల ఉద్యోగాలు హామీ ఏమైందని విమర్శించారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిన తర్వాత నెలన్నర రోజుల పాటు నిద్ర లేని రాత్రులు గడిపానని ఆయన తెలిపారు. ఇందల్‌వాయి మండలంలోని గన్నారం, మేఘ్యు నాయక్ తాండ, సంస్థాన్ సిర్నపల్లి, నల్లవెల్లి, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి 44 నుంచి గన్నారం, సిర్నాపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించానని, తాండాలను గ్రామపంచాయతీలుగా మార్చింది ఘనత కెసిఆర్‌కు దక్కుతుందని తెలిపారు. ఐదు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన 6 గ్యారంటీలు.. 4000 పెన్షన్, రైతుబంధు 15000, యువతకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ప్రతి ఒక్కరికి సౌభాగ్యలక్ష్మి కింద రూ.2500, ఈ స్కీములన్ని ఎక్కడ అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులను మహిళలు, ప్రజలు నిలదీయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలపై జవాబు చెప్పలేక తిరిగి పారిపోతారని పేర్కొన్నారు. రూరల్‌లో ఎన్నో రకాలుగా అభివృద్ధి చేశానని.. కాని కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలను ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయలేదని వివరించారు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చింది లేదని, వారు అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు ఇచ్చింది లేదని తెలిపారు.

ఇక బిజెపి పార్టీ స్థానిక ఎంపీ ఐదేళ్ల కాలయాపన చేసి గెలవగానే ఐదు రోజుల్లోనే పసుపు బోర్డ్ తెస్తానని, గల్ఫ్ పాలసీ తెస్తానని, ఇంట్లోనే టోల్ ఫ్రీ పెట్టి అదుకుంటానని చెప్పి పచ్చి మోసం దగా చేశాడని దుయ్యబట్టారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని జూట మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి గెలిచిన ఎంపీ అరవింద్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఐదేండ్లుగా ఏ ఒక్క గ్రామానికి రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందాలనే కుట్రలు చేస్తుందని విమర్శించారు. మరోసారి అధికారంలోకి బిజెపి వస్తే రిజర్వేషన్లు ఉండవని వివరించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ఈనెల 13న ఎన్నికల రోజున ప్రజలు అమూల్యమైన ఓటుతో.. కర్రుకాల్చి వాత పెట్టాలని, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గల్ఫ్‌లో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం గల్ఫ్ పాలసీ కోసం కొట్లాడి తీసుకువస్తానని, రైతులకు పసుపు బోర్డు తీసుకువస్తానని, ఆశీర్వదిస్తే ఎళ్ళవేళలా సేవకుడిగా పనిచేసి పెడతానని ఆయన వివరించారు. అనంతరం రాజ్యసభ్య సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కేసీఆర్‌తోనే సాధ్యమని, ఎన్నో హామీలు ఆశచూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని అన్నారు. పార్లమెంట్‌లో జిల్లా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కృషి చేస్తారని తెలిపారు. ఆయనకు ప్రతిఒక్కరూ ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, జడ్పీటీసి సుమన రవిరెడ్డి, వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి దాస్, మండల జాయింట్ సెక్రటరీ పులి శ్రీనివాస్, ఎంపీటీసీలు లావణ్య రవి, సుధీర్, బాబురావు, చింతల దాస్, తాటిపాముల శ్రీనివాస్ గుప్తా, కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, మారంపల్లి సుధాకర్, లలిత గణేష్, క్రాంతి కుమార్, అంబర్ సింగ్, బీరిష్ శెట్టి, మాజీ సర్పంచ్లు తెలు విజయ్ కుమార్, విజయలక్ష్మి, లక్ష్మారెడ్డి, అను హుస్సేన్, సాంబార్ శ్రీకాంత్, పిండి గంగాధర్, రాజేందర్, గడ్కోల్ శ్రీనివాస్, రూరల్ కన్వీనర్ పాశం కుమార్, బీఆర్ఎస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల నాయకులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, సీనియర్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటింగ్ ప్రక్రియ పరిశీలించిన


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. పార్లమెంటు సెగ్మెంట్‌లోని నిజామాబాద్ రూరల్ శాసనసభా నియోజకవర్గానికి సంబంధించి నిజామాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ సేకరణ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు జాగ్రత్తలు సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య, పార్ట్ నెంబర్‌ను చెక్ చేసుకోవాలని అన్నారు. ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని, అనవసర తప్పిదాలకు పాల్పడకూడదని హితవు పలికారు. మైక్రో అబ్జర్వర్లు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరుపుతారని అన్నారు. కాగా, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దిబ్బ సరస్వతి భర్త దిబ్బ సుదర్శన్ బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ సునీల్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుదర్శన్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సునీల్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దిబ్బ సుదర్శన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపునకు, కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు పాటుపడుతానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, నాయకులు రామాగౌడ్, బెజ్జారం భాను, తుమ్మల ఆనంద్, మధు, గుమ్మడి దేవేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో హెూమ్ ఓటింగ్


ఓటు వేస్తున్న వృద్ధురాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులకు హెూమ్ ఓటింగ్ నిర్వహించినట్లు తహసీల్దార్ ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. చౌట్‌పల్లి, అమీర్‌నగర్, హసకొత్తూర్, కమ్మర్‌పల్లి, నాగపూర్ గ్రామాల్లో హెూమ్ ఓటింగ్ నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. రూట్ నెంబర్ 9లో భాగంగా ఐదు గ్రామాల్లో కలిపి 15 మంది ఓటర్లకు గాను 14 మంది ఇంటి వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఒక ఓటర్ ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంతో ఓటు హక్కు వినియోగించుకోలేదని ఆయన స్పష్టం చేశారు. చౌట్‌పల్లిలో ఇద్దరూ, అమీర్‌నగర్‌లో ఒకరు, హసకొత్తూర్‌లో ఇద్దరూ, నాగపూర్‌లో ముగ్గురు, కమ్మర్‌పల్లిలో ఏడుగురికి గాను ఆరుగురు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. ఓటింగ్ గోప్యతను పాటిస్తూ పూర్తి పారదర్శకంగా హెూమ్ ఓటింగ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, పోలింగ్ ఆఫీసర్ గోపి, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ సంజయ్, ఓపిఓ రాందాస్, యంవో శైలేష్ శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శాంతి కుమార్, గంగాజమున, సంధ్య, శ్రీలత, నరసయ్య, బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బందల రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

గత కొన్ని సంవత్సరాలుగా మూలన పడ్డ బందల, మాచపురం రోడ్డు పనులు పున:ప్రారంభమైనట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ పనులను పూర్తి చేయడానికి హామీనిచ్చిన బోధన్ నియోజకవర్గం ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి పనులను వేగవంతం చేసి యుద్ధ ప్రాతిపదికపైన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే రెంజల్ రైతులకు తమ పంట పొలాలకు వెళ్లడానికి అనుకూలంగా మారుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, స్థానిక నాయకులు జి.సాయిరెడ్డి, సిహెచ్.రాములు, సాయిబాబాగౌడ్, ధనుంజయ్, జావీద్ ఉద్దీన్, ఎమ్మెస్ రమేష్ కుమార్, నరసయ్య, మోహన్, బి.రవి, సిద్ధస్థాయిలు, సగ్గు వెంకటి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు పూర్తయినందున కేంద్రాల మూసివేత

- సింగిల్ విండో చైర్మన్ సామాబాపు రెడ్డి


కొనుగోలు కేంద్రం..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాసముందర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తయినందున కేంద్రాలను శుక్రవారంతో మూసివేస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ సామాబాపురెడ్డి తెలిపారు. విండో పరిధిలోని కొనుగోలు కేంద్రాలైన కోనాసముందర్, నర్సాపూర్ వద్ద కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పూర్తి ధాన్యం సేకరించినందున కొనుగోలు కేంద్రాలను మూసేస్తున్నట్లు వెల్లడించారు. వరిధాన్యం కొనుగోలుకు సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా సహకార అధికారికి, డిఎస్ఓ, మండల తహసీల్దార్, సంఘం డైరెక్టర్లకు, సంఘం సిబ్బందికి విండో పరిధిలోని గ్రామాల రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-సిరికొండ

గ్రామాల్లో నెలకొన్న వివిధ విద్యుత్ సమస్యలుంటే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి పరిష్కరించుకోవాలని ఏఈ దాసరి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ అధికారులతో కలిసి విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 1నుంచి 7వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేసుకొని ప్రమాదాలకు గురికావొద్దని అన్నారు. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్లు సుభాష్, జలేంధర్, తిరుపతి, మోహన్ తదితరులున్నారు.

కొనసాగుతున్న వ్యక్తిత్వ వికాస శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ

భగవాన్ శ్రీ సత్యానంద గీతా భక్త జనా శ్రమం కిసాన్‌నగర్ భగవాన్ శ్రీ సత్యానంద చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో కిసాన్‌నగర్ ఆశ్రమంలో బాల బాలికల వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వైభవోభితంగా ఆచార్య శ్రీహరి తీర్థ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో పిల్లలకు నిత్య శ్లోకావళి, భగవద్గీత శ్లోకాలు, డ్యాన్స్ క్లాసులు, సంగీతం క్లాసులు అంతేకాకుండా బాల బాలికల వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన మోటివేషనల్ క్లాసులను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆశ్రమ అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్, కార్యదర్శి చిలుక జ్ఞానేశ్వర్, ట్రస్ట్ సభ్యులు సహకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో విరజానంద స్వామి, విశోక తీర్థ స్వామి, పరమేశ్వరీ మాతాజీ, శారద మతాజి, గోలి గంగారం, రామకృష్ణ, శేషగిరి, మధు, ఆశ్రమ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన లాయిడి కిషన్ (58) నిప్పంటుకోవడంతో మృతి చెందినట్లు సిరికొండ స్థానిక ఎస్సై జి రమేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కిషన్ పెద్దవాల్గోట్ గ్రామ శివారులో ఉన్న తన పొలంలో వరిగడ్డికి నిప్పంటించడానికి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు వెళ్ళాడు. గడ్డికి నిప్పుపెట్టిన క్రమంలో మంటలు అతని చుట్టూ వ్యాపించడంతో ఆ మంటలో చిక్కుకొని ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఎంతసేపైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో మరుసటి ఉదయం కుటుంబ సభ్యులకు వెళ్లి చూడగా కాలిపోయిన మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గన్నారంలో పోలీసులు కవాతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలో సిఎపిఫ్ బలగాలతో కవాతును నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవర్ ఆదేశాల మేరకు ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, ఎస్సైలు బి.మనోజ్ కుమార్, యు.మహేష్ సర్కిల్ పోలీస్ సిబ్బంది, సిఎపిఎఫ్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎండి.ఫక్రుద్దీన్, జట శంకర్ యాదవ్‌తో కలిసి గ్రామంలో రహదారి వెంట కవాతు నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బాజిరెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఎడపల్లి



బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బోధన్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ సతీమణి అయేషా ఫాతిమా, జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు ఎడపల్లి మండలంలోని అంబం (వై), ఎడపల్లి, మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి, జానకంపేట్, తానాకలాన్ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శ్రీరామ్, నాయకులు ఆకుల శ్రీనివాస్ , ఎంపీటీసీలు బద్దోల్లా పద్మ ముత్తన్న, మనిషారెడ్డి, అరుగుల వనజ నాగరాజు, షేక్ బాబా, బీఆర్ఎస్ ఎడపల్లి మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి మాణిక్యాల సురేష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రోళ్ల గంగాధర్, గ్రామ కమిటీ అధ్యక్షులు హాసేన్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు భేష్

- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన ప్రత్యేక అధికారి శరత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చేపడుతున్న ముందస్తు చర్యలు భేషుగ్గా ఉన్నాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి శరత్ అభినందించారు. ప్రస్తుత మే మాసంలో ఎండల తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుక్రవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి జిల్లాలో మంచి నీటి సరఫరా పరిస్థితిపై మండల స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారని, వేసవి సీజన్ ముగిసేంత వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి శరత్ అధికారులకు సూచించారు. ఏదైనా నివాస ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు గమనించిన వెంటనే, ముందస్తుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. బోరుబావుల మరమ్మతులు చేపట్టే మెకానిక్‌కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోరు చెడిపోయిందన్న సమాచారం అందిన వెంటనే గంటల వ్యవధిలోపు మరమ్మతులు పూర్తి చేయించి దాహార్తి సమస్య తెరపైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చేపడుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే గ్రామ పంచాయతీలకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాటు చేయాలని, అవసరమైతే పక్క జీపీకి చెందిన ట్యాంకర్‌ను కూడా వినియోగించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి శరత్

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చామని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నీటి సరఫరా తీరును పరిశీలించేందుకు వీలుగా నియమించిన మండల ప్రత్యేక అధికారులు వారం వారం క్రమం తప్పకుండా మండలాల్లో పర్యటిస్తూ పర్యవేక్షణ జరుపుతున్నారని అన్నారు. అన్ని మండలాల్లో ఎంపిడిఓలు, ఎంపిఓలతో కూడిన క్లస్టర్ బృందాలు సైతం నిరంతరం నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. నీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉన్న పలు ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించామని జిల్లా ప్రత్యేక అధికారి దృష్టికి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా సజావుగానే జరుగుతోందని, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టేవిధంగా అధికారులను, క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉంచామని అన్నారు. సమీక్షలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల కేంద్రానికి చెందిన గైని గంగామణి (36) గర్భ సంబంధ కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాజిరెడ్డిగోవర్ధన్‌ను గెలిపించండి

- బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



వర్ని : ప్రచారంలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని(చందూర్)/నిజామాబాద్‌సిటీ

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి శుక్రవారం ఘన్‌పూర్ గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటువేసి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని, అప్పుడే అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మాజీ సర్పంచ్ గంగారాం, గ్రామ అధ్యక్షులు నరహరి, సీనియర్ నాయకులు సమద్ ఖాన్, కుర్మ సాయగొండ, బాలరాజుగౌడ్, సలీమ్ ఖాన్, మండల సెక్రటరీ సంజీవ్, గైని సాయిలు, ఈశ్వర్‌గౌడ్, ప్యారం అశోక్, రాంరెడ్డి, మూడ్ అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరంలోని 40వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డివిజన్ ఇంచార్జి శివకుమార్

డిగ్రీ పరీక్షలకు వన్ టైం ఛాన్స్ ఫీజు తేదీ పొడిగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ వర్సిటీ పరిధిలోని 2011 నుంచి 2016 వరకు డిగ్రీ-(వైడబ్ల్యూఎస్) అనుత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వన్ టైం ఛాన్స్ కొరకు ఫీజు చెల్లింపు తేదీని పొడగించినట్లు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఏ/బీకాం/బీఎస్సీ/బీబీఏ/బిఏ(ఎల్) కోర్సులకు ఒకటవ, రెండవ, మూడవ సంవత్సరపు బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్ టైం ఛాన్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలు జూన్, జూలైలో జరుగుతాయని పరీక్ష ఫీజు తేదీ అపరాధ రుసుము లేకుండా 02.05.24 వరకు రూ.100 అపరాధ రుసుముతో 03.05.24 వరకు చెల్లించాలని గతంలో పేర్కొన్న తేదీని పొడగిస్తూ 9.5.24 వరకు అపరాధ రుసుం లేకుండా రూ.100 అపారద రుసుముతో 10.05.24 వరకు చెల్లించవచ్చునని కంట్రోలర్ పేర్కొన్నారు. 2016 నుండి 2019 వరకు డిగ్రీ (సిబిసిఎస్) కోర్సులకు వన్ టైం ఛాన్స్ ఇచ్చినట్టు తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు వద్ద ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కూలీలు

నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 కూలి డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని బాగేపల్లి, కిసాన్‌తండా గ్రామాలలోని ఉపాధి హామీ కూలీల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీ పథకాలను తూచా తప్పకుండా అమలు పరిచే విధంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందని రెంజల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొబిన్ ఖాన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్, ధనుంజయ్, నాగభూషణం రెడ్డి, జావీద్, సాయిబాబాగౌడ్, జి.సాయిరెడ్డి, సిహెచ్ రాములు, నీరెడి సాయిలు, శ్రీనివాస్ గౌడ్, మైనీ మోహన్, నరసయ్య, ప్రవీణ్ గౌడ్, మోహన్, సాయినాథ్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతో కూడిన ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆపదలో ఉన్న వారిని ఎలా రక్షించడంలో చేపట్టవలసిన కార్యక్రమాలను గన్నారం అగ్ని మాపక సిబ్బంది వివరించారు. శుక్రవారం డిచ్‌పల్లి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ వద్ద అగ్ని మాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదం సమయంలో చేపట్టవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు నివారణకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విపత్తులు గోదాములలో, షాపింగ్ మాల్ లో ప్రమాదాలు జరగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ సతీష్, రూట్ ఆపరేషన్ మేనేజర్ విరాజ్ దేశ్పాండే, టోల్‌ప్లాజా మేనేజర్ చలపతి రావు, మేయింటినెన్స్ మేనేజర్ కృష్ణకాంత్, నారాయణ మూర్తి, సంతోష్ రెడ్డి, ఇంచార్జీ సురేష్, వేణు, జైపాల్, సతీష్, తిరుపతి, మోహన్, కె.అనంత్ రాజ్, షేక్ అయూబ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఓటు బాధ్యత మనదే

- అవినీతి లేని సమాజ నిర్మాణానికి ఓటర్ల పాత్ర కీలకం

నవతెలంగాణ-ఆర్మూర్

ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిది. సద్వినియోగం చేసుకుంటేనే సార్థకత ఉంటుంది. ఓటు ద్వారా పాలకులను ఎన్నుకొనే హక్కు రాజ్యాంగం కల్పించింది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తమ విలువైన ఓటును సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు అవకాశం కల్పించింది. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో యువత వజ్రాయుధం లాంటి తమ ఓటును ఆలోచించి ఉత్తమ నాయకుడికే ఓటు వేయాలని పలువురు మేధావులు పేర్కొంటున్నారు.

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలో అభివృద్ధి ఏ మేరకు జరిగిందో.. దానికి కారణాలు ఎవరు.. అభివృద్ధి జరగక పోవడానికి కారణం ఎవరు..? అని ఆలోచించి సరైన నాయకుడిని ఎంచుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది. అలాంటి నాయకుడిని ఎన్నుకునే తరుణంలో తొందరపాటు వద్దని పలువురు మేధావులు పేర్కొంటున్నారు. ఓటు వేసేటప్పుడు రాజకీయ నాయకులు ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తుంటారు. తాను ఎంతో అభివృద్ధి చేశానని, తమ వైపునకు మలుచుకునేలా అభ్యర్థులు ఎంతోమంది తమ ప్రయత్నాలు కొనసాగిస్తుంటారు. తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే నాయకులకే యువత ఓటర్లు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇకనైనా



ఈ ఎన్నికలలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని సరైన నాయకుని ఎంచుకోవాలని మేధావులు పేర్కొంటున్నారు.

అనుమానాలకు తావివ్వకుండా..

ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ బూతులోకి వెళ్ళినప్పుడు ఓటరు కార్డు, ఆధార్ కార్డుతో ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఓటు వేసేటప్పుడు నిదానంగా మనం ఏ నాయకుడికి వేయాలనుకుంటున్నామో గుర్తించి, ఆ పార్టీ గుర్తుపై సరిగ్గా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు హక్కును వినియోగించుకున్న ఐదు సెకండ్ల తర్వాత మనం ఏ గుర్తుకు అయితే ఓటు వేసామో ఆ గుర్తు వివి ప్యాడ్‌లో కనిపిస్తుంది. అప్పటివరకు తాము ఏ గుర్తుకు ఓటు వేశామని విషయమై నిర్ధారణకు వచ్చిన తర్వాతే పోలింగ్ బూత్ నుంచి నిష్క్రమించాలి. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలింగ్ బూత్ అధికారులకు సమాచారం అందించాలి.


మొట్టమొదటిసారి ఓటు..



రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మొట్టమొదటి సారి ఓటు హక్కును వినియోగించుకుంటున్నాను. నేను మాత్రం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే నాయకులకే నా ఓటు వేస్తా. అవినీతి నిర్మూలనకు యువత నడుం బిగించాలి.

- ఎం.లలిత్ చంద్ర, బీటెక్ విద్యార్థి, పెర్కిట్.

భవిష్యత్తు పాలన కోసం..



ఐదేండ్ల భవిష్యత్తు పాలన కోసం ఓటు హక్కును అతి జాగ్రత్తగా వినియోగించాలి. ప్రలోభాలకు లోనైనట్లయితే అసమర్థత, అవినీతి పాలనకు మనమే కారకులవుతాం.

- యు.రాకేష్ కుమార్, వైద్యులు, ఆర్మూర్.

సీఎంసీలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన





కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు, కలెక్టర్, సీపీ తదితరులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి సీఎంసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, ఈ మేరకు కౌంటింగ్ కోసం చేపడుతున్న ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఇతర సహాయ రిటర్నింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుతో పాటు నిజామాబాద్ అర్బన్, రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కూడా సీఎంసీలోనే చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను, ఆయా సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు గదులు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అబ్జర్వర్‌కు వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల వద్ద సీ.సీ కెమెరాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, కౌంటింగ్ టేబుల్స్, కౌంటర్లు, ఇతర సదుపాయాలకు సంబంధించి కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని, తుది దశకు చేరిన పనులను వేగవంతం చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ సాకేత్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, కార్మిక శాఖ అధికారి యోహాన్, మెప్మా పీ.డీ రాజేందర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఖరీఫ్ ధాన్యం పంటకు రూ.3 వేలు మద్దతు ధర

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాడిపత్రి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.3 వేలు ధర కల్పిస్తామని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి తాడిపత్రి జీవన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అమ్రాద్, మాక్లూర్ గ్రామాల్లో కర్నార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో అందరి మద్దతు కావాలని కోరారు. గ్రామాలలో ఏ అభివృద్ధి కావాలన్నా.. కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని వివరించారు.